ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 14 జూలై 2024

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం - 8లో..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత - 8లో..



రేషన్‌కార్డుల జారీ ఎప్పుడో?

- అర్హుల ఎదురు చూపులు
- ముఖ్యమంత్రి, మంత్రుల ప్రకటనలతో ఆశలు
- ప్రజాపాలనలోనూ విన్నపాలు
- చేర్పులు, మార్పులకు నోచుకోని పరిస్థితి
- 40 వేల మంది దరఖాస్తుల పెండింగ్
- సంక్షేమ పథకాలకు ఆటంకం
- చేర్పులు, మార్పుల కోసం 20,606 మంది నిరీక్షణ
- జిల్లాలో రేషన్ లబ్ధిదారులు 4.97 లక్షల మంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు లేకపోవడం నిరుపేద కుటుంబాలకు ఆటంకంగా మారింది. గత ప్రభుత్వ కాలం నుంచి కొత్త కార్డులు అందించకపోగా కార్డుల్లో చేర్పులు, మార్పులకు కూడా నోచుకోని పరిస్థితి. దాదాపు ఆరు సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి హామీ ఇచ్చినా ఇటీవల పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో ఇంకా ప్రక్రియ మొదలు కాలేదు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల సమయంలోనే 40 వేల మంది రేషన్ కార్డుల కోసం అర్జీ పెట్టుకున్నారు. చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తు చేసుకొని 20,606 మంది నిరీక్షిస్తున్నారు. తరచూ ప్రకటనలతో అయోమయానికి గురవుతున్నా తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పౌర సరఫరా అధికారులు నిర్వహించిన సమావేశంలో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించబోతున్నట్లు చెప్పడంతో లబ్ధిదారుల్లో రేషన్ కార్డులపై ఆశలు చిగురించాయి. మళ్లీ కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు జారీ చేస్తారోనని ఎదురు చూపుల్లో మొదలయ్యాయి. కానీ కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ఇప్పటికి ప్రకటనలే తప్ప సరైన స్పష్టత మాత్రం రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

చేర్పులు, మార్పులకు ఎదురు చూపులు

జిల్లాలో రేషన్ కార్డుల దరఖాస్తుల మాట ఎలా ఉన్నా చేర్పులు, మార్పులకు సంబంధించి 20,606 మంది దరఖాస్తు చేసుకొని నిరీక్షిస్తున్నారు. ఇందులో కొంత మేరకు పరిశీలన జరిగినా మార్పులు మాత్రం లేవు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 1321, చందుర్తి 1760, గంభీరావుపేట 2125, ఇల్లంతకుంట 1760, కోనరావుపేట 1403, ముస్తాబాద్ 1914, రుద్రంగి 948, సిరిసిల్ల 2689, తంగళ్లపల్లి 1333, వీర్నపల్లి 481, వేములవాడ రూరల్ 1105, వేములవాడ 2105, ఎల్లారెడ్డిపేటలో 2032 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

జిల్లాలో రేషన్ కార్డులు

జిల్లాలో ప్రస్తుతం లక్షా 73 వేల 745 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు 4,97,103 మంది ఉన్నారు. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,59,854, అంత్యోదయ కార్డులు 13,684, అన్నపూర్ణ కార్డులు 207 ఉన్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు రాకపోగా కనీసం ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చకపోవడం. చేర్పులు, మార్పులు కూడా జరగలేదు. జిల్లాలో చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు 20,606 పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటున్నారు.

వీటితోపాటు గతంలోనే రేషన్ కార్డు కోసం 40 వేల మంది వరకు అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. 2018 సంవత్సరానికి ముందు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 2021 ఆగస్టులో 2271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత కనీసం మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా అందించలేకపోయారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామనే ప్రభుత్వ ప్రకటనలతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రజా పాలనలో దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలోనూ దరఖాస్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ అయినా ఆరు గ్యారంటీల్లో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో రేషన్ కార్డు సంబంధించిన కాలం లేకపోయినా ప్రభుత్వ ఆదేశాల మేరకు విడిగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో 1.92 లక్షలు వివిధ ఆప్షన్లలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 40 వేల మంది వరకు రేషన్ కార్డులు, చేర్పులు, మార్పుల కోసం అర్జీలు ఇచ్చారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను రేషన్ కార్డులు లేకపోవడంతో అందుకోలేకపోయారు. రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకే సంక్షేమ పథకాలు అందిన నేపథ్యంలో తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేకమంది డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు అందుకోలేకపోయారు. మరోవైపు వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందే సమయంలో కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల్లో ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 12,808 మంది, చందుర్తి 11,737, ఇల్లంతకుంట 16,598, గంభీరావుపేట 15,567, కోనరావుపేట 14,802, ముస్తాబాద్ 16,127, రుద్రంగి 5404, తంగళ్లపల్లి 16,766, వీర్నపల్లి 4741, వేములవాడ 7854, వేములవాడ రూరల్‌లో 8050, ఎల్లారెడ్డిపేట 17,030, సిరిసిల్ల మున్సిపాలిటీ 30,146, వేములవాడ మున్సిపాలిటీలో 14,987 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో చాలా మంది తెల్ల రేషన్ కార్డు లేని వారు ఉన్నారు. ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మీ (రూ.2500) 1,28,549 మంది, మహాలక్ష్మీ (గ్యాస్ సిలెండర్) 1,65,278 మంది, రైతు భరోసా రైతులు 69,723 మంది, కౌలు రైతులు 5642 మంది, వ్యవసాయ కూలీలు 76,953, అమరవీరులకు ఇంటి స్థలం 338 మంది, ఉద్యమకారులు 2130, ఉచిత విద్యుత్ 1,42,966 మంది, దివ్యాంగుల పింఛన్లు 4824, ఇతర పింఛన్లు 71,677, ఇందిరమ్మ ఇళ్లు 1,10,198 మంది దరఖాస్తు చేసుకున్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, ఎస్పీ

ఇల్లంతకుంట, జూలై 13: వాతావరణ కాలుష్యం పెరిగితే ప్రాణుల జీవన ప్రమాణాలు తగ్గుతాయని, కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలను పెంచడమే మార్గమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అడవులు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయని, అందువల్లనే ప్రజలు అనేక రకాలైన వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఆహారం లేక కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని, గుట్టల ప్రాంతంలో పండ్లమొక్కలను నాటాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం నాటిన మాదిరిగా ఇష్టానుసారంగా మొక్కలు నాటవద్దన్నారు. ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 5 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ ఆవరణలో 500 పండ్ల మొక్కలను నాటుతున్నామన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు అంతగిరి వినయ్ కుమార్, పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, బాలపోచయ్య,భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి,ఒగ్గు రమేష్, బాలరాజు, లింగం, నాగయ్య, గూడనరేందర్‌రెడ్డి, మల్లయ్య, అంతగిరి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి సీఎం కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూలై 13 : రాష్ట్రంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని నిస్సహాయులకు సహాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. గత ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించిందన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ.10 లక్షల వరకు పెంచినట్లు చెప్పారు. రైతును రాజు చేయడానికి ఆగస్టు 15లోపు రెండు లక్షల రుణ మాఫీ చేయడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు భరోసాపై కమిటీ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయ సేకరిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోలా రాళ్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గుట్టలకు రైతు బంధు ఇవ్వకుండా కేవలం రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వడం కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కింద ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గత ప్రభుత్వంలో పడిన బకాయిలను ఇప్పటికి తమ ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తోందని అన్నారు. ఇటీవల సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌ను స్వయంగా తాను సందర్శించానని, కార్మికుల ఉపాధిపై జిల్లా కలెక్టర్‌తో పలుమార్లు సమావేశాలను నిర్వహించామని అన్నారు. త్వరలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌తో నేతన్నల సమస్యల పరిష్కారానికి సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో నిరుపేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాలలో వెలుగులు నింపే కార్యాక్రమానికి శ్రీకారం చుట్టడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రహదారి కోత.. రాకపోకలకు చింత


కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డు

ఎల్లారెడ్డిపేట, జూలై 13: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని వంతెన వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డు ఓ వైపు కోతకు గురైంది. నిత్యం వందల సంఖ్యలో ఆ రహదారి వెంట వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. రోడ్డు పక్కన భారీ కోతకు గురవడంతో ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించాలని, కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్న దర్శనానికి క్యూలో భక్తులు


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎంపీ రంఘునందన్‌రావు

వేములవాడ కల్చరల్, జూలై 13 : వేములవాడ రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

రాజన్న సేవలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం దర్శించుకున్నారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీమ్‌లోకి తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. అంతకుముందు ఎంపీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. ఏఈవో ప్రతాప నవీన్, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.

నాది ఓ నెగెటివ్ బ్లడ్ గ్రూప్.. అవసరమైతే ఇచ్చేందుకు సిద్ధం


సౌకర్యాలపై అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

- మందులు అందుబాటులో ఉంచండి
- నీటి సమస్యను పరిష్కరిస్తాం- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో రోగులకు అవసరమైతే రక్తం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని, తనది ఓ నెగెటివ్ బ్లడ్ గ్రూప్ అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులు, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, మెటర్నిటీ వార్డు, ఎస్ఎన్‌సీయూ, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రుల్లో ఉన్న ఇబ్బందుల గురించి అడిగితెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అవసరమైతే తన రక్తం అందిస్తానన్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. విధుల్లో ఉన్న డాక్టర్ల వివరాలను తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజన్ వ్యాధులకు సంబంధించి అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని పరిసరపాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై రోగులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఐసీయూ, ఎస్ఎన్‌సీయూలోని ఇబ్బందులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా ఆసుపత్రిలో నీటి సమస్యపై రోగులు కలెక్టర్‌కు తెలిపారు. స్పందిస్తూ నీటి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్ఎంవో సాయికుమార్, వినత, నిఖిత ఉన్నారు.

'కందేపీ క్లాస్ రూం' కథల పుస్తకావిష్కరణ


కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖ బాల సాహితీ వేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ విద్యార్థులపై రాసిన కథలతో వెలువరించిన 'క్లాస్‌రూం కథల' సంకలనాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా ఇంకోళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. బాలసాహిత్యంలో సైన్స్ రచనలపై పరిశోధనలు చేస్తూ విభిన్నమైన కథలు, వ్యాసాలు అందిస్తున్నా కందేపీ రాణీప్రసాద్ బాల్యదశలో చదువుకున్న ఉన్నత పాఠశాల ఇంకోళ్లలో అక్కడి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చేతుల మీదుగా క్లాస్‌రూం కథల సంకలనాన్ని ఆవిష్కరింపజేశారు. రాణీప్రసాద్ బాల సాహిత్యంలో 50 పుస్తకాలు, సాంస్కృతిక కళలపై నాలుగు పుస్తకాలు, ఆరు బాలల గేయాలు, పది సైన్స్ పుస్తకాలు, తొమ్మిది ఇంగ్లీష్ అనువాద పుస్తకాలు, ఆడియో కథలే కాకుండా కవిత్వంతోపాటు ఎన్నో పుస్తకాలను వెలువరిచారు. ప్రముఖ సాహితీ సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు. తాజాగా క్లాస్ రూం కథల సంకలనాన్ని వెలువరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ కందేపీ ప్రసాద్‌రావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పున్నంచందర్‌కు ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పున్నంచందర్

సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలు, ఆత్మహత్యల నిరోధకంపై కొన్ని సంవత్సరాలుగా కృషి చేస్తున్న సిరిసిల్లకు చెందిన సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్‌కు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డును మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ మంత్రి వెంకటరత్నం, సినీనటుడు కేవీ ప్రదీప్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. పున్నంచందర్ సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యల నివారణలో విభిన్నమైన పద్ధతులను అవలంబించారు. అవార్డు అందుకోవడంపై సైకాలజిస్ట్ ఈశ్వర్, వేణు, రాము, అంజనేయులు, అరవింద్, హరిప్రసాద్ అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్ల రూరల్, జూలై 13 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, శివనగర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈలు మధుకర్, సుష్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉంటుందని దీనిలో ఈ సబ్ స్టేషన్‌ల పరిధిలోని వెంకంపేట, పాతబస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, కోర్టు ఏరియా, సర్దార్‌నగర్, శాంతినగర్, అంబేద్కర్‌నగర్, రాళ్లబావి, దోబీగల్లీ, రెడ్డివాడ, వెంకటేశ్వర టెంపుల్, గాంధీనగర్, మున్సిపల్ ఆఫీస్‌ఏరియా, విద్యానగర్, గీతానగర్, పోచమ్మటెంపుల్ ఏరియా, సుభాష్‌నగర్, నెహ్రూనగర్, వెంకట్రావునగర్, గోపాల్‌నగర్, బీవైనగర్, గణేష్‌నగర్, శివనగర్, కొత్తబస్టాండ్, ఇందిరానగర్, చంద్రంపేట, రగుడు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 13 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శనివారం రాత్రి సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు అకౌంట్ నంబర్లు, అపరిచితులకు చెప్పవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. అనంతరం సైబర్ కేసులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

బీర్‌పూర్,జులై 13: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో శనివారం జగిత్యాల డీఎస్పీ రఘుచంధర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో విచారణ చేపట్టారు. ఈ నెల 11న తమను కులం పేరుతో దూషించారని కామెర రాజేశ్వర్ అనే వ్యక్తి కొల్వాయి గ్రామానికి చెందిన రామకిష్టు గంగాధర్ కుటుంబ సభ్యులపై ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసు విషయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామిలు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సిబ్బంది ఉన్నారు.

గట్టుదుద్దెనపల్లిలో కాపర్‌వైరు చోరీ

మానకొండూర్, జూలై 13 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కాపర్ వైరు చోరీకి గురైంది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి సుమారు రూ. 30వేల విలువ గల కాపర్ వైర్‌ను దొంగిలించారు. చంజర్ల ఏఈ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డమ్మీ తుపాకీతో కనిపించిన యువకుడు

● అదుపులోని తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

బీర్‌పూర్, జూలై 13: పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో డమ్మీ తుపాకీతో మండలానికి చెందిన ఓ యువకుడు బీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి వివరాలు తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా బొమ్మ తుపాకీ కలిగి ఉన్న యువకుడు పాఠశాల సమీపంలో కన్పించడంతో అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆ బొమ్మ తుపాకీని ఫొటోషూట్ కోసం అమెజాన్‌లో కొనుగోలు చేశానని తెలుపగా, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను ఎంఆర్‌పీఎస్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని ఆయనను కోరారు.

కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి మృతి


కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, జూలై 13: కరీంనగర్‌కు చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (89) అనారోగ్యంతో కరీంనగర్‌లో శుక్ర వారం రాత్రి మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న స్వామి హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. దేశ వ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాముల్లో ఆయన ఒకరు. ఆయన మెట్‌పల్లి ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డ్‌లో అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం సన్యాసం స్వీకరించారు. ఆయన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిషంలో పలు గ్రంథాలు రచించారు. జూలై 2004లో ఆయన సన్యాసాశ్రమం స్వీకరించారు. స్వామి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. స్వామీజీ పార్థివ దేహాన్ని ఆయన కోరిక మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం, నీరుకుళ్ల రంగనాయకస్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సాంప్రదాయం ప్రకారం బృందావనంలో ఖననం చేశారు.

శంషాబాద్‌కు రాజధాని బస్సులు

భగత్‌నగర్, జూలై 13: జగిత్యాల డిపో నుంచి శంషాబాద్‌కు రాజదాని బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సోమవారం నుంచి జగిత్యాల డిపో నుంచి బయలుదేరే రాజధాని బస్సులు ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్‌బీనగర్, మీదుగా శంషాబాద్ చేరుకుంటాయన్నారు. జగిత్యాల నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 4.30, 8.00 గంటలకు, కరీంనగర్ నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 5.45, 9.30 గంటలకు, శంషాబాద్ నుంచి కరీంనగర్/జగిత్యాలకు ఉదయం 7.15, 8.00 గంటలకు బస్సులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఓదెలలో సుబేదర్ గంజ్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

ఓదెల, జూలై 13: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి సుబేదర్ గంజ్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును అధికా రులు శనివారం రెండు గంటల పాటు నిలిపివేశారు. అప్‌లైన్లో వ స్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు న్న కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లైన్ క్లియర్ లేకపోవడంతో, ఉదయం 10 గంటలకు వచ్చిన ఎక్స్ ప్రెస్ రైలు ఓదెలలో నిలిపి వేశారు. 12 గంటల తర్వాత అధికారులు కిలో మీటర్ వెనుకకు పంపించి మరో లైన్ ద్వారా సుబేదార్ గంజ్ వైపు పంపించారు. దీంతో పొత్కపల్లి, కొలనూర్, ఓదెల స్టేషన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే ప్రజలు ఓదెల గేటు వద్దనే ఆగిపోయారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీలోకి శనివారం 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు సామర్థ్యం 90.323 టీఎంసీలకు ప్రస్తుతం 12.556 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.775 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముస్తాబాద్, జూలై 13: మండలంలోని బందనకల్ శివారులో మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తుడుము శ్రీనాథ్ (24) 10వ తేదీన బందనకల్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనాథ్ ప్రేమ విషయంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోయడాని ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


గుగులోతు సరోజ (ఫైల్)

వీర్నపల్లి, జూలై 13: మండల కేంద్రానికి చెందిన గుగులోతు సరోజ (55) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సరోజ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త పీర్యా గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్ల చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు అనారోగ్య సమస్యలు రావడంతో ఆవేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నేరెళ్ల బాధితుడు హరీష్

తంగళ్లపల్లి, జూలై 13: న్యాయం కోసం రిలే నిరాహార దీక్ష చేపడు తున్నాని, దానికి అనుమతి కావాలని నేరెళ్ల బాధితుడు కోల హరీష్ తంగళ్లపల్లి పోలీసులకు శనివారం వినతి పత్రం అందజేశాడు. 2017 సంవత్సరంలో కొతమంది పోలీస్ అధికారులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చిత్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. అధికారు లపై చర్యలు తీసుకోవాలని విన్నవిం చినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 17వ తేదీన నేరెళ్ల గ్రామ పంచాయతీ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపాడు. దీనికి పోలీసులు అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

జమ్మికుంట, జూలై 13: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఆకుల లక్ష్మి (60) ఖాళీ వాటర్ బాటిళ్ళు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంది. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

15 మంది మందుబాబుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 13: సిరిసల్ల పట్టణం శాంతినగర్ ప్రాంతంలో శనివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన మందుబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యంబాటి ళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 5 ఆటోలు సీజ్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం మృతి


నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, జూలై 13: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న జర్మన్ షెపర్డ్ సంతతికి చెందిన పోలీస్ జాగిలం ట్యాంగో అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామం లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్, పోలీస్ అధికారులు, పోలీస్ డాగ్ హ్యాండ్లర్ లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్యాంగో ఎనిమిదేళ్లలో జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలు, మొత్తం 99 కేసుల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తో కలిసి ఐటీపీ మెయినాబాద్‌లో ఎనిమిది నెలల బేసిక్ ట్రెయినింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూలై 13: కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఈవో ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ బ్యాంక్ పాలకవర్గం పదవీ కాలం రెండు నెలల క్రితం ముగిసింది. కొత్త పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న జీవో విడుదల చేసింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా కరీంనగర్ అదనపు కలెక్టర్ వ్యవహరించనుండగా, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తో పాటు గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, ఎ విద్యాసాగర్, ఇ లక్ష్మణ్‌రాజు, ఎండీ సమియొద్దీన్, మంగి రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుడు గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ బ్యాంక్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది సహకారంతో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్ ఫండ్‌ను మూడు నెలల్లో విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచి ప్రారంభోత్సవంతోపాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచి పరిధిలో ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులను బ్యాంక్ సిబ్బంది ఈ సందర్భంగా సన్మానించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, కాంరెడ్డి రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, సర్దార్ దన్నాసింగ్, పోరండ్ల రమేష్, ఎండీ అమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, అనరాసు కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబానా, లింగమూర్తి, రాజ్‌కుమార్, జ్యోతి, ఇమ్రాన్, షాన్‌వాజ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 3: అప్పుల బాధ భరించలేక మండలంలోని మోతె చెరువులో దూకి జగిత్యాల పట్టణానికి చెందిన ఏదుల కిషోర్ (46) ఆత్మహత్యకు చేసుకున్నాడని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కిషోర్ పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో కిరాణం నడుపుతూ జీవిస్తున్నాడు. షాపు నిర్వహణకు ఐదు లక్షల రూపాయలు అప్పు చేశాడు. కొన్ని రోజుల నుంచి దుకాణం నడవడం లేదు. దీంతో చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై తెలిపారు.

● **నమిలకొండలో..**

కొడిమ్యాల: మండలంలోని నమిలకొండ గ్రామానికి చెందిన శతరాసి సురేష్ (39) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు పోలీసులు శనివారం తెలిపారు. సురేష్ కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులో చూపించుకున్నా నయం కాలేదు. దీంతో జీవి తంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథానికి నమస్కరిస్తున్న భక్తులు

రాయికల్, జూలై 13: రాయికల్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు రథయాత్రను ప్రారంభించారు. రథం ముందు రోడ్డును ఊడ్చి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. స్థానిక అంగడి బజార్‌లో ప్రారంభమైన యాత్ర గాంధీ విగ్రహం నుంచి పటేల్ బొమ్మ మీదుగా శివాజీ చౌక్ నుంచి తిరిగి పాత బస్టాండ్ వరకు చేరుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రథయాత్ర కమిటీ సభ్యులు, యువకులు, శ్రీకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ


ధర్మపురి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 13: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానం కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీ సరిపల్లి ధర్మవాసవి దంపతులు 1,00,116 రూపాయల శనివారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు.

'చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలి'

తంగళ్లపల్లి జూలై 13: తంగళ్లపల్లి శివారులోని మానేరు నదిలో నిర్మించిన చెక్‌డ్యాం వరదలకు కొట్టుకు పోయిందని, ఆ చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు, గీత కార్మికులు కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాసిరకం పనులతో వరదకు చెక్ డ్యాం కొట్టుకుపోయిందన్నారు. వ్యవసాయ భూమితోపాటు గీతకార్మికుల తాటి చెట్లు పెంచుతున్న భూమి కోతకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చెక్‌డ్యాం తెగిపోవడంతో ఏర్పడ్డ నీటి గుంతలో పడి చిన్నారులు మృతి చెందారన్నారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవడం తోపాటు త్వరగా మరమ్మతులు చేపట్టి చెక్‌డ్యాంను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడితే తెగిన చెక్‌డ్యాంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఆలోపే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గీత కార్మికులు ఎద్నాల తిరుమలరెడ్డి, ఎద్నాల బాల్‌రెడ్డి, బండి సత్తయ్య కొండయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి, జూలై 13: పట్టణంలోని త్రిశక్తి ఆలయం వార్షికోత్సవాన్ని నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలతో కుంకుమ పూజ జరిపించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్య నారాయణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భూములకు పరిహారం ఇప్పించండి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భూ నిర్వాసితులు

సిరిసిల్ల రూరల్, జూలై 13: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించి తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరారు. సిరిసిల్లలో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబరు 408లో ఉన్న 36 ఎకరాల భూముని మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భూములను కోల్పోయిన తమకు మరోచోట భూములను అందిస్తామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆ భూముల్లో భవనాలను నిర్మించారని, నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీవోను అడిగితే తమపైనే అక్రమ కేసులను పెట్టించారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరిం చారు. తమ భూములకు నష్టపరిహారంతోపాటు మరోచోట భూములను అందించాల ని కోరారు. పట్టణ పరిధిలోని విలీన గ్రామాలైన సర్దాపూర్, పెద్దూర్ గ్రామాలు ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని, ఆ గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్నా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూముల్లో నిర్మాణాలను చేపట్టేందుకు పట్టాలను అందించి అనుమతులను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సలేంద్రి బాలరాజుయాదవ్, మెడుదుల దేవయ్యయాదవ్, గొడుగు మల్లేశం, గొడుగు పర్శరాములు, గొడుగు చిన్నఎల్లయ్య, నాగుల లక్ష్మీ, సలేంద్రి రాజ్యలక్ష్మి, లింగంపల్లి అశోక్, లింగంపల్లి భూలక్ష్మీ, ఎనగందుల ప్రేమల, ఉలిసే తిరుపతి, బడుగు భూమయ్య పాల్గొన్నారు.

చెరువు కట్ట, రహదారి కబ్జా చేశారని రైతుల ఆందోళన


మంథనిలో ధర్నా చేస్తున్న రైతులు

మంథని, జూలై 13: రైతులు తమ వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లేందుకు వినియోగిస్తున్న చెరువుకట్ట, రహదారిని కొంత మంది కబ్జా చేశారని రైతులు మంథనిలోని అబేద్కర్‌చౌక్‌లో శనివారం ఆందోళనకు దిగారు. రైతుల కథనం ప్రకారం.. బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 116లోని 217 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువులోని నీటి ద్వారా మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ధర్మారం, సీతంపల్లి, బిట్టుపల్లి, ఎక్లాసూపూర్, నెల్లిపల్లి గ్రామాల్లోని వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. చెరువు మీద నుంచి పొలాల వద్ద వెళ్లేందుకు కొన్నేళ్లుగా రైతులు చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని వినియోగిస్తున్నారు. చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని ముత్తినేని స్వామి, మాధవరావు కిష్టయ్య, పోగుల శంకరయ్య, ఆకుతోట రాజయ్య అనే రైతులు తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిట్టుపల్లి గ్రామ రైతులు భూమి కబ్జాను అడ్డుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా గత సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్ర మంలో కలెక్టర్‌ను కలిసి కబ్జా విషయాన్ని వివరించి అడ్డుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కబ్జా స్థలం వద్దకు వెళ్లి పంచనామా నిర్వహించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కబ్జాదారులు దీన్ని పట్టించుకోకుండా చెరువుకట్ట, రహదారి భూమిని తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన రైతులంతా ఏకమై శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకట్ట రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కబ్జాదారులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న మంథని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో రైతులంతా మంథనికి చేరుకొని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిం చారు. తమ చెరువు కట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని.. తమ రహదారిని పునరుద్ధరించాలని.. వెంటనే తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విరమింపే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. ధర్నా చేసే రైతులతో మంథని తహసీల్దార్ రాజయ్య ఫోన్లో మాట్లాడి సోమవారం వరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

ధర్మపురి, జూలై 13: ధర్మపురి పట్టణానికి చెందిన మెరు గు శ్రీనివాస్, గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన ఐతం వెంకటేష్ గత నెలలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించిన ఎస్ఐ ఉదయ్‌కుమార్ వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాస్, వెంకటేష్‌కు శనివారం అప్పగించారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు


నారాయణస్వామి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 13: కరీంనగర్ సప్తగిరి కాలనీ మాచ ర్ల గార్డెన్ వెనుక వైపున ఓ వృద్ధుడి మృతదేహం లభ్య మైందని కరీంనగర్ టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో పెద్దపల్లి నారాయణస్వామి (70), మార్కండేయనగర్ అని చిరునామా ఉందన్నారు. ఆ చిరునామా ప్రకారం ఇంటి నంబర్‌ను తనిఖీ చేయగా ప్రభుత్వ పాఠశాలదిగా వెల్లడైందని తెలిపారు. మృ తుడు నారాయణకు సంబంధించిన వారు కరీంనగర్ రెండో రాణా సీఐ (8712670762) లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ కె రవీందర్ (9491481433)క సంప్ర దించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి లోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, జూలై 13: మండలంలోని మామిడాలపల్లిలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన చింతల కిరణ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీలో రేషన్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారని గుర్తించిన పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి తిరుపతి తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి పట్టుకున్నారు. దిరావత్ పాండు, దిరావత్ చందా, దిరావత్ శ్రీను మూడు ఆటోల్లో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాయికల్, జూలై 13: మండలంలోని రాజ్‌నగర్ తండా, ధర్మాజీపేట గాంధీ తండాలలోని నాటుసారా స్థావరాలపై శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారు చేసినా, అమ్మినా, కలిగి వున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడు ల్లో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం


తునికి శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై 13: మండలంలోని కొత్తపేట కు చెందిన తునికి శేఖర్ (27) అనే యువకుడు దుబాయ్‌లోని షార్జాలో 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్, విదేశాంగ మంత్రి జై శంకర్‌తో మాట్లాడారు. జీడబ్ల్యూపీసీ సమక్షంలో అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, బొడ్డుపల్లి రాములు ఆధ్వర్యంలో యువకుడు పని చేస్తున్న బియ కంపెనీతో మాట్లాడారు. వారి ప్రయత్నంతో శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది.

● జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేష్ (38) ఇరాక్ లో ఇటీవల మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 23న సురేష్‌కు పక్షవాతం రావడంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న సమ యంలో గుండెపోటుకు గురై చెందినట్లు గ్రామస్థులు తెలిపా రు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పు చెల్లించమన్నాడని హత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13: తీసుకున్న అప్పు చెల్లించ మన్నందుకు గొడవ తలెత్తింది. ఆ గొడవ కత్తి పోట్లకు దారితీసింది. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందిల్లకు చెందిన చొప్పరి లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన దండె రాహుల్‌రాజ్‌పై శనివారం కత్తితో దాడి చేశాడు. సుందిల్ల గ్రామానికి చెందిన చొప్పరి లక్ష్మణ్ ఇంటికి సమీపంలో ఉండే రాహుల్ రాజ్‌ను అవసరాల నిమిత్తం లక్ష రూపాయలు అప్పుగా అడగగా, అతను ఓ వ్యక్తి వద్ద ఇప్పించాడు.

ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పాడు. గడువు ముగియడంతో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని రాహుల్ పలుమార్లు లక్ష్మణ్‌ను అడిగాడు. శుక్రవారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇవ్వనని తిట్టాడు. రాత్రి రాహుల్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ అతడిపై గొడ్డలితో దాడికి ప్రయత్నిం చగా స్వల్ప గాయాలయ్యాయి. దాడి తర్వాత లక్ష్మణ్ పారిపో యాడు. శనివారం ఉదయం మరోసారి రాహుల్‌రాజ్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ కత్తితో దాడి చేశాడు. దీంతో రాహుల్‌కు కాలిపై, మొహంపై గాయాలయ్యాయి. రాహుల్ కుటుంబసభ్యులు లక్ష్మణ్‌పై కారంపొడి చల్లడంతో అక్కడ నుంచి పారి పోయాడు. రాహుల్‌రాజ్ భార్య ప్రేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, జూలై 13: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బోయినపల్లి మండలం వరదవెల్లికి చెందిన మందల సాయి, మందల వెంకటేష్, మందల వంశీ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడ్డారు. బెట్టింగులలో పాల్గొనడానికి డబ్బులు సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. బోయినిపల్లి మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన ఈడుగు కనుకయ్య పొలం దున్నడానికి ట్రాక్టర్‌ను తన పొలం వద్దకు తీసుకురాగ గమనించిన నిందితులు ట్రాక్టర్‌ను దొంగలించాలని నిర్ణయించుకున్నారు. రాత్రి సమయంలో ఈడుగు కనుకయ్య పొలంవద్ద ఎవరూలేని సమయాన్ని అదునుగా బావించి ట్రాక్టర్‌కు ఉన్న కేజ్ వీల్స్‌ను అక్కడే వదిలేసి కల్టివేటర్‌తో సహా ట్రాక్టర్‌ను దొంగిలించారు. ఈ విషయమై కనుకయ్య బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 2వ తేదీన ఫిర్యాదు చేశాడు. ఏఎస్పీ ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్ గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమరాల ఆధారంగా నిందితులు ట్రాక్టర్‌ను బోయనిపల్లి మండలం, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా భీమ్‌ఘల్, ఆర్మూర్ నుంచి లోకేశ్వరం మండలంలోని మోడెం గ్రామానికి తీసుకెళ్లినట్లు గుర్తించారు. మోడెం గ్రామానికి తీసుకెళ్లిన ట్రాక్టర్‌ను నిందితులు అదే గ్రామానికి చెందిన గంజాయి పోశెట్టికి అమ్మగా నిందితులతోపాటు ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన పోశెట్టిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కల్టివేటర్‌తో ఉన్న ట్రాక్టర్, స్విఫ్ట్ డిజైర్ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, పృథ్వీగౌడ్ ఉన్నారు.

ముస్తాబాద్‌లో పర్యటించిన ప్రభుత్వ విప్



సన్మానిస్తున్న వైద్యులు చింతోజు శంకర్, రాజారాం

ముస్తాబాద్, జూలై 13: ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పర్యటించారు. నామాపూర్‌లోని కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి నివాసంలో భోజనం అనంతరం ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సెల్ఫీలకు పోటీ పడ్డారు. కులసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. బీజేపీ అధ్యక్షుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ చింతోజు రాజారాం, డాక్టర్ చింతోజు అర్చన మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డిని, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బుర్ర రాములు అనారోగ్యానికి గురికాగా వారి ఇంటి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతి, గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి శీల భాను, దీటి నర్సింలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి అభినందనలు

ఇల్లంతకుంట, జూలై 13: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన చెలిమెల జనార్దన్‌రెడ్డి అనే విద్యార్థిని మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ శనివారం అభినందించారు. జనార్దన్‌రెడ్డి ఇటీవల సీఏలో ఉత్తీర్ణుడు అయ్యాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన జనార్దన్‌రెడ్డి గ్రామంలోనే సీఏ చదివిన మొదటి విద్యార్థిగా నిలిచాడన్నారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు.

మొక్కలను దహనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ఎల్లారెడ్డిపేట, జూలై 13: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు నాటేందుకు తీసుకు వచ్చిన 1000 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం దహనం చేశారని ఆ శాఖ అధికారులు, స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు సమీప అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ పనులను చేపట్టారు. మొక్కలను నాటేందుకు 1000 మొక్కలను తీసుకొచ్చి సిద్ధంగా ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ మొక్కలపై కట్టెలు వేసి నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. అటవీ భూములను సాగు చేసుకోవాలనే ఉద్దేశంతోనే కొందరు మొక్కలను దహనం చేశారని గుర్తించామని ఎఫ్ఎస్‌వో బాపురాజు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణ లక్ష్మికి డబ్బులు అడిగారని మహిళ వీడియో

- సోషల్ మీడియాలో వైరల్

- కొద్దిసేపటికి కోపంతో ఆరోపించానని మరో వీడియో

తంగళ్లపల్లి జూలై 13: కల్యాణ లక్ష్మీ చెక్కు ఇప్పిస్తానని ఓ కాంగ్రెస్ నాయకుడు కాసులు తీసుకున్నాడని మహిళ ఆరోపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు కల్యాణ లక్ష్మీ చెక్కు ఇప్పిస్తానని తన వద్ద నుంచి రూ.7 వేలు తీసుకున్నాడని వీడియోలో వాపోయింది. సోషల్ మీడియాలో మహిళ వీడియో వైరల్ అయ్యింది. కొద్దిగంటల్లోనే అదే మహిళ తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని అని కల్యాణ లక్ష్మీ చెక్కు రాకపోవడంతోనే ఆరోపణలు చేసినట్లు మరో వీడియో సోషల్ మీడియాలో దర్శనమిచ్చింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించినట్లు చర్చసాగుతోంది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, జూలై 13: మండలంలోని పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి శనివారం పరామర్శించారు. రేపాక, గాలిపెల్లి, తెనుగువారిపల్లె గ్రామాలలో వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలకు 50కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంసాగర్, ఎల్లేష్, అనీల్, యాదగిరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జానపద గాయకురాలికి డాక్టరేట్

జగిత్యాల టౌన్, జూలై 13: జిల్లాకు చెందిన చిందం అంకారపు సునీత సాహిత్య సేవ, సమాజ సేవకురాలు, జానపద గేయ రచయిత, గాయకురాలు గౌరవ డాక్టరేట్‌ను సాధించింది. స్ఫూర్తి ఇంటర్ నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ, ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలిందించిన పలువురకి గౌరవ డాక్టరేట్‌లను అందజేశారు. జిల్లాకు చెందిన సునీత సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా సునీత శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సునీతను కళాశ్రీ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కవయిత్రిలు సరోజన, అనిత, కవిత, శ్రీలక్ష్మి, కమల, లావణ్య తదితరులు సునీతకు అభినందనలు తెలియజేశారు.

బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గం

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో శనివారం బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా మంచాల కృష్ణ, అధ్యక్షుడిగా డాక్టర్ ఏ శేలందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బీమయ్యా, చిన్న గంగారాం, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, జాయింట్ సెక్రటరీగా రమేశ్, వి. శ్రీనివాస్, కోశాధికారిగా యు. మహేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్‌కే శంషుద్దీన్, నరేశ్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నుంచి ఎన్నికల పరిశీలకుడిగా ఇంతియాజ్ ముస్తాక్ అలీ వ్యవహరించారు. అనంతరం విరూపాక్షి గార్డెన్స్‌లో మొక్కలు నాటారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణ లక్ష్మి చెక్కు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, జూలై 13: అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లక్ష్మీమల్లారెడ్డి కన్వెన్షన్ హాలులో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన 151 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీడ నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికిపాటు పడుతోందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యం లోని సర్కారు అమలు చేస్తోందన్నారు. మహాలక్ష్మీ, గృహలక్ష్మీ, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను అందిస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అందించి రైతు సంక్షేమం కోసం పాటు పడుతోందన్నారు. 2008లో అప్పటి కాంగ్రెస్ హయాంలో రైతులకు రూ.70 వేల కోట్ల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మంత్రి వర్గంలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకుందని, ఆగస్టు 15న రైతులందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నిలిచిపోకూడదని ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్ల పాలనలో వాగులు, వంకలు, గుట్టలకు రూ.24 వేల కోట్ల రైతుబంధు అందించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. సాగు చేసే రైతులకే అందించాలనే లక్ష్యంతో రైతు భరోసాకు మంత్రి వర్గ ఉప సంఘం కమిటీని నియమించి విధివిధానాలను తయారు చేస్తోందన్నారు. త్వరలోనే రైతులకు రైతు భరోసా అందించి ఆదుకుంటుందన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేసేలా చర్యలు చేపడుతోందన్నారు. వరి పంటకు బోనస్ అందించనుందన్నారు. నిరుపేద ఆడ బిడ్డల వివాహాలకు రూ.లక్షతోపాటు తులం బంగారం అందించి ఇచ్చిన మాటను నిలుపుకుంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డును అందించనుందన్నారు. మల్కాపేట జలాశయం 9వ ప్యాకేజీలో భూములను కోల్పోయిన రైతులకు పరిహారం అందించేలా పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. గ్రామాల్లో నెలకొన్న పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు పాటు పడుతామన్నారు. పార్టీలకతీతంగా పల్లెల ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. ఆర్డీవో రమేశ్, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ రామచంద్రం, వీర్నపల్లి నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

● కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆటో యూనియన్ ఆధ్వర్యంలోని డ్రైవర్లు కలిశారు. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలు నడుపుతూ వెళ్లదీస్తున్న తమ బతుకులు రోడ్డున పడ్డాయని, తమను ఆదుకోవాలని మొర పెట్టుకున్నారు. సుమారు 500 మంది ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతినడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని వాపోయారు. తమ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు నెలకు రూ.12 వేల జీవన భృతి చెల్లించేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆటో కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గంభీరావుపేట : త్వరలో 9వ ప్యాకేజీ పనులను పూర్తిచేసి నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరిధిలోని పంటలను పూర్తి స్థాయిలో సాగులోకి తెస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని దత్తసాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం లబ్ధిదారులు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరలో 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని, ఎగువ మానేరు ఆయకట్టును పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఆరు గ్యారంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపేందుకు 200 యూనిట్ల వరకు జీరో కరెంట్ బిల్లు వంటి పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

గంభీరావుపేటలోని పురాతన రామాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. రామాలయ ప్రత్యేకత, ఆలయ విశిష్టతను ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నర్సాగౌడ్ వివరించారు. సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఆర్డీవో రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి ఉన్నారు.

తంగళ్లపల్లి: పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి తదితర పథకాలను అమలు చేస్తున్నా మన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో రమేశ్, ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కొడూరి భాస్కర్ గౌడ్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తూ ప్రజల సమస్యలను పరిష్కంచడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ముస్తాబాద్ సహకార సంఘం అధ్యక్షుడు అన్నం రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.66 లక్షల దీర్ఘకాలిక రుణాలు, రూ.25 లక్షల గొర్రెలు, గేదేల పెంపకం రుణాలు, కర్షక మిత్ర పథకం ద్వారా రూ.40 లక్షల రుణాలను రైతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఆర్ఐ తోట ధర్మేందర్ వినతి పత్రాన్ని అందించారు. ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ సురేశ్, నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుండెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, జూలై 13: మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో గుంటి సత్తవ్వ, మౌనికకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం, గ్రామ అధ్యక్షుడు కల్లపల్లి తిరుపతి, నాయకులు బుదపట్ల వెంకటేశం, సబ్బాన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఆపత్కాలంలో నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి అన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ప్యాక్స్ డైరెక్టర్ కేసిరెడ్డి నర్సారెడి, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, చెలుకల తిరుపతి పాల్గొన్నారు.

కోనరావుపేట : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బలుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంతోపాటు పలు గ్రామాల్లో చెక్కులు అందజేసినట్లు తెలిపారు. శనివారం సోమిశెట్టి ముత్తవ్వకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసి మాట్లాడారు. వేములవాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో ప్రతీ గ్రామంలోని పేదవారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, తాళ్లపెల్లి ప్రభాకర్, సంకరి పరుశరాములు, బుచ్చి రాములు, నీరటి సంజీవ్, కనకరాజు, గంగయ్య, నరేష్, సిద్ధి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘటన

గంభీరావుపేట, జూలై 13: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్, మాచారెడ్డి మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాచారెడ్డికి చెందిన జనపాల వెంకటి (57) మృతి చెందాడు. వెంకటి ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్ మండలం మద్దికుంట వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. మద్దికుంటలో వారి బంధువు చనిపోగ, అంత్యక్రియలకు వెళ్లి వస్తున్నాడు. ముస్తాఫనగర్ దాటాక చెరువు వద్ద వెంకటి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడడంతో హుటాహుటిన కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్ది సేపటికే వెంకటి మృతి చెందాడు. ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

రాళ్లవాగు కుడి కాలువ మరమ్మతుకు టెండర్లు పూర్తి

కథలాపూర్, జూలై 13 : ఏడాది కిందట కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రాళ్లవాగు కుడి కాలువ మరమ్మతులకుగాను ఎట్టకేలకు టెండర్లు పూర్త య్యాయి. ఈ కాలువ నీటి ఉధృతికి నక్కల ఒర్రె వద్ద తెగిపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందక పంటలు ఎండిపోయాయి. దీంతో రైతాంగం తీవ్ర నష్టాలకు గురయ్యారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ కాలువ పరిస్థితిపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. తెగిపోయిన ప్రాంతం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో ఉండగా రాగా ఆర్మూర్ ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోకి వస్తుంది. ఆయకట్టు వేములవాడ నియోజకవర్గం కింద ఉన్నందు వల్ల ఇరిగేషన్ శాఖా మంత్రితో మాట్లాడి రు. 21 లక్షలు మంజూరు చేయించారు. పలు వురు టెండర్లు దాఖలు చేయగా డేగా కన్‌స్ట్రక్షన్ కంపనీ ఈ పనులు దక్కించుకుందని ఏఈ శేఖర్ శనివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న గోవర్ధన్

కోరుట్ల, జూలై 13 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని బీడీ వర్కర్స్ పెడరేషన్ నేత భోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో వివిధ కార్మిక సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములుతో కలిసి ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న బీడి వర్కర్స్ పెడరేషన్ నేత గోవర్ధన్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బీడి కార్మికుల ఓట్ల కోసం ఎన్నో వాగ్దానాలు చేసి వాటి అమలు మరిచిందని అన్నారు. పీఎఫ్ ఉన్న బీడి కార్మికుల రాజీనామాల అనంతరం పదవి విరమణ పెన్షన్ రూ. 5,000కు కేంద్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రధాని అవాస్ యోజన పథకంగా ద్వారా కార్మికులకు ఇల్లు నిర్మించి ఇవ్వా లన్నారు. బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు సంక్షేమ ద్వార ఉచిత వైద్య సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో బీడి వర్కర్స్ పెడరేషన్ నేతలు ముక్రం, మౌలానా, కడారి రాములు, కొక్కుల శాంత, కేవి అనసూయ, రాంగారెడ్డి, లక్ష్మణ్, అజ్జవేణు, బాను ప్రసాద్, దేవదాస్, ఎన్నం రాధలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన ఎస్పీ

సిరిసిల్ల క్రైం/ వేములవాడ రూరల్, జూలై 13: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా వేములవాడ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌ల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లను నరికి వేయడంతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిని చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. చెట్లను నరకడం సులభమని క్షణాల్లో నరకవచ్చుని , మొక్కను నాటి చెట్టుగా చూడడానికి చాలా సమయం పడుతుందని అన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ తరపున 5వేల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, అంజయ్య, రమేష్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని రూరల్ సీఐ మొగిలి పిలుపునిచ్చారు. శనివారం వన మహోత్సవంలో భాగంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ అవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనమహోత్సవం బాధ్యతగా భావించి ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలన్నారు. ఎస్సై సుధకార్ పాల్గొన్నారు.

చందుర్తిలో..

చందుర్తి: వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణలో దాదాపు 200 మొక్కలు నాటినట్లు తెలిపారు. పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట : మొక్కలు నాటితేనే మానవాళికి మనుగడని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా శనివారం 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్కలతోనే మానవ సమాజానికి ఆక్సిజన్ అందుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.



మొక్క నాటుతున్న సీఐ మొగిలి



మొక్క నాటుతున్న పోలీసులు



చందుర్తిలో మొక్క నాటుతున్న సీఐ వెంకటేశ్వర్లు